1. నా చేతలు చేసినట్టి - దోషంబులే గదా = నా రాజు చేతులలో ఘోరంపు జీలలు ॥చూడరే॥
2. దురితంపు దలంపులే - పరమగురిని శిరముపై = నెనరు లేక మొత్తెనయ్యో - ముండ్ల కిరీటమై ॥చూడరే॥
3. పరుగెత్తి పాదములు - చేసిన పాపంబులు = పరమ రక్షకుని - పాదములలో మేకులు ॥చూడరే॥
4. పాపేచ్ఛ తోడఁ గూడు - నాదు చెడ్డ పడకలే = పరమగురుని ప్రక్కలోని - బల్లెంపు పోటులు ॥చూడరే॥

- ఒంగోలు అబ్రహాము

## 194 యేసు పై మనదోషము మోపబడెను

రా - సావేరి (చాయ: ఎందుకే నా డెందమా) తా - ఆది

యేసునాధుని సిలువపైని - వేసి శ్రమఁబొందించినది నా - దోసమే - దుస్సహ - వాసమే ॥యేసు॥

1. [1]కంటక కిరీట [2]మౌదల - నంటగొట్టించినది నాచెడు - తలఁపులే - పాపపు పలుకులే ॥యేసు॥
2. మృదుకరంబుల మేకులందింపి - నదితలఁప నా హస్తకృత కా - ర్యంబులే దుష్క - ర్మంబులే ॥యేసు॥
3. పాదయుగమున నాటిచీలలు - బాధ నొందించినది నా చెడు - నడకలే - దోసపు - పడకలే ॥యేసు॥
4. దాహముం గొనఁజేదు చిరకను - ద్రావదలఁచినది మధుపానా - సక్తియే - యందను - రక్తియే ॥యేసు॥
5. హెచ్చుగ లోహిత పతనముగఁ - గ్రుచ్చిన కుంతంబు నా పా - పేచ్ఛలే - హృదయదు - రేచ్ఛలే ॥యేసు॥

---

[1]ముండ్ల. [2]తల



6. పావనగాత్రంబు క్షతమయ - మై వెతలపాల్జేసినది నా - దేహమే - యఘ సం - దోహమే ॥యేసు॥
7. దీనిఁగని నా మానసాబ్జము - లోని కలుషము దూరపర్చక - నడుతునా - ధారుణిఁ - గడుతు నా ॥యేసు॥

- జుటిక దావీదు

## 195 క్రీస్తు శ్రమల ధ్యానము

రా - ముఖారి (చాయ: పాపము దలచు సుమీ) తా - ఆది

ఎన్నఁడు గాంచెదమో - యేసుని - నెన్నఁడు గాంచెదమో = యెన్నఁడు జూతుము - కన్నె కుమారుని - సన్నుతి జేయుచును ॥నెన్నఁడు॥

1. అంధుల గాచె నఁట - యెహోవా - నందనుఁ డితఁడౌనట = పొందుగఁ బాపాత్ములకొర - కై తన - ప్రాణము విడిచెనఁట ॥యెన్నఁడు॥
2. వేసిరి సిలువనఁట - క్రీస్తుని - జేసిరి హేళనఁట = డాసిరి యూదులఁట - బల్లెము - దూసిరి ప్రక్కనఁట ॥యెన్నఁడు॥
3. చిందెను రక్తమఁట - పరమ - సంధులు దెల్పెనఁట = నిందల కోర్చె నఁట - మన దగు - నేరము గాచెనఁట ॥యెన్నఁడు॥
4. ఆపద కోర్చెనఁట - పాపపు - మోపులు మోసెనఁట = కోపము మాన్పెనఁట - యెహోవా - కొడుకై వెలసెనఁట ॥యెన్నఁడు॥
5. అక్షయుఁ డితఁడెనఁట - జగతికి - రక్షకుఁ డాయెనఁట = దీక్షగ నమ్మిన నరులం - దరికి ని - రీక్షణ దేవుఁడఁట ॥యెన్నఁడు॥

- గొల్లపల్లి నతానియేలు

## 196 క్రీస్తు సిలువమీఁద పల్కిన యేడు మాటలు

రా - హిందుస్థాని కాపి తా - రూపకము

ఆహా మహాత్మ హా శరణ్యా - హా విమోచకా = ద్రోహ రహిత చంపె నిను నా - దోషమేగదా ॥యాహా॥